క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



పరీక్షలు జరుపుతున్న వైద్యులు

ఓర్వకల్లు: క్షయవ్యాధి నివారణలో భాగంగా మండలంలోని శకునాల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత టీబీ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. హుసేనాపురం వైద్యాధికారి డాక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి, టీబీ వైద్యాధికారిణి రజని హాజరై పలువురికి క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. 80 మందికి ఎక్స్‌రేలు తీశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కాగా మొబైల్ వాహనాన్ని ప్రభుత్వానికి అప్పగించిన సేవాభారతి అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాసులు రెడ్డికి డాక్టర్లు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ సూపర్‌వైజర్ ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

'సుంకేసుల'లో 1.026 టీఎంసీల నీరు నిల్వ



సుంకేసుల జలాశయం

గూడూరు: సుంకేసుల జలాశయంలో 1.026 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డ్యాం అధికారులు శుక్రవారం తెలిపారు. ఇన్ ఫ్లో నిలిచిపోయిందని, కర్నూలు ప్రజల తాగు నీటి అవసరాల కోసం 130 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని అధికారులు తెలిపారు.

వేళకు రారు



గడివేముల తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ కుర్చీ

గడివేముల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ కళావతి సమయపాలన పాటించకపోవడంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు.ఆమె ప్రతి రోజు 12 గంటల సమయంలో వస్తున్నా తహసీల్దార్ చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. శుక్రవారం సైతం ఆమె 11.50 గంటలకు కార్యాలయానికి చేరుకున్నారు. దీనిపై తహసీల్దార్ శ్రీనివాసులును వివరణ కోరగా ఆమె గుడికి వెళ్లడంతో వేళకు రాలేకపోయారని చెప్పడం గమనార్హం.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు

కోడుమూరు రూరల్: పైర్లకు మోతాదుకు మించి ఎరువులు, మందులను వాడరాదని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ సూచించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో నిర్వహించిన మండల వ్యవసాయ సలహా మండలి సభ్యుల సమావేశంలో మాట్లాడారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఎంతో మేలును చేకూరుస్తున్నాయన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి పంటలకు అవసరమైన మందులను మాత్రమే పిచికారీ చేసుకోవాలన్నారు. వ్యవసాయ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సలహా మండలి సభ్యులకు సూచించారు. సమావేశంలో ఏఈఓ తస్లీమ్, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, సభ్యులు లక్ష్మన్న, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, శేఖర్ పాల్గొన్నారు.

సెలవుల్లో నగరపాలక కమిషనర్

కర్నూలు(టౌన్) : నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవ్ తేజ శుక్రవారం నుంచి సెలవులకు వెళ్లారు. వ్యక్తిగత పనుల నిమిత్తం ఈనెల 18వ తేదీ వరకు ఆయన సెలవులో ఉంటారని నగరపాలక కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. నగరపాలక ఇన్‌చార్జ్ కమిషనర్‌గా రామలింగేశ్వర్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి శ్రీలక్ష్మి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలన సౌలభ్యం కోసం ఆయనను నియమించినట్లు తెలిపారు.

అనుమతి లేని లేఅవుట్ల కూల్చివేత

కర్నూలు(టౌన్) : పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులు లేకుండా వెలసిన పట్టణ వెంచర్లను శుక్రవారం టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. స్థానిక జొహరాపురం పరిధిలో మొత్తం 40 ఎకరాల్లో అక్రమంగా వెలసిన వెంచర్లపై చర్యలు చేపట్టారు. వెంచర్లలోని ఫెన్సింగ్‌లను, ప్రహరీ గోడలను, ప్లాట్ల నెంబర్ల కోసం వేసిన రాళ్లను పూర్తిగా తొలగించారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్ మాట్లాడుతూ నగర పరిధిలో వెంచర్లకు, భవన నిర్మాణాలకు తప్పనిసరిగా అనుమతులు ఉండాలన్నారు. నిబంధనలు విస్మరిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ రంగస్వామి, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు హరిష్ చౌదరి, శబరీష్, చైన్‌మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్‌కు మార్గదర్శకం!

- యువతపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- వారిలో నైపుణ్యాలు పెంచేందుకు చర్యలు
- చదువుతో పాటు ఉద్యోగార్హతకు శిక్షణ
- పాఠశాలలు, కళాశాలల్లో నిష్ణాతులచే ట్రైనింగ్
- నేడు అంతర్జాతీయ యువజన దినోత్సవం

మన సమాజంలో చాలా మంది యువతీ యువకులు ఉన్నత చదువులు చదివి డిగ్రీ చేతబట్టుకుని బయటకు వస్తున్నారు. కానీ వారు ఈ పోటీ ప్రపంచంలో సరైన ఉద్యోగాలు సాధించలేకపోతున్నారు. దీనికి ప్రధాన కారణం నైపుణ్యాలు లేకపోవడమే. వారిలో నైపుణ్యాలు పెంపొందించి ప్రతిభకు సానబట్టి ఉద్యోగ, ఉపాధి ద్వారా భవిష్యత్‌ను బంగారుబాట వేసుకునేందుకు జిల్లా యువజన సంక్షేమ శాఖ చర్యలు చేపడుతోంది. ఈ నెల 12వ తేదీన అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని యువతకు జిల్లా యువజన సంక్షేమ శాఖ ద్వారా జరుగుతున్న కార్యక్రమాలపై ప్రత్యేక కథనం.



నైపుణ్య అంశాలపై యువతకు శిక్షణ ఇస్తున్న దృశ్యం



విద్యార్థినులకు బుక్‌లెట్ అందజేస్తున్న అధికారులు

కర్నూలు(హాస్పిటల్): ప్రపంచంలో అన్ని దేశాల కంటే మన దేశంలోనే యువత అధికంగా ఉంది. తద్వారా మానవ వనరులు అధికంగా ఉన్న దేశంగా గుర్తింపు పొందింది. కానీ చాలా మంది సరైన నైపుణ్యాలు లేక ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు సాధించలేక చతికిల పడుతున్నారు. ఈ ఇబ్బందులను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. జిల్లా యువజన సంక్షేమ శాఖ ద్వారా అవసరమైన కార్యక్రమాలకు రూపకల్పన చేసింది. ఒకవైపు విద్యార్థులకు చదువు కొనసాగిస్తూనే మరో వైపు వారికి కెరీర్ గైడెన్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, లైఫ్‌స్కిల్స్, ఇంటర్వ్యూ, ఎగ్జామ్ ప్రిపరేషన్‌పై ఉచితంగా తరగతు లు నిర్వహిస్తోంది.ఇందుకోసం ట్యూటర్లు, కౌన్సిలర్లతో జిల్లాలోని ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోంది. ఇప్పటి వరకు జిల్లాలోని మొత్తం 59 జూనియర్, డిగ్రీ కళాశాలలు, ప్రభుత్వ పాఠశాలల్లో 5,200 మందికి పైగా విద్యా ర్థినీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. దీంతో పాటు ఉన్నత చదువులు, వాటిని అందిస్తున్న విద్యాసంస్థలు, ప్రవేశపరీక్షలతో కూడిన వివరాలతో ఉన్న బుక్‌లెట్‌ను పంపిణీ చేశారు.

యువజన సంక్షేమ శాఖ కార్యక్రమాలు

- జాతీయ, అంతర్జాతీయ ప్రముఖ దినాలలో యువతకు ఆ రోజు ప్రాముఖ్యతను తెలియజేస్తున్నారు. ఈ మేరకు వివిధ అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను సంబంధిత శాఖలు, విద్యాసంస్థల సహకారంతో చేపడుతున్నారు.
- దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆజాదీకా అమృత్ మహోత్సవ్ పేరు మీదుగా స్వాతంత్ర్య పోరాట యోధుల త్యాగాలను స్మరించుకుంటూ భారత దేశ ఔన్నత్యాన్ని, సంస్కృతి, సంప్రదాయాలు, ఇప్పటి వరకు సాధించిన ప్రగతిని పౌరులందరికీ తెలియజెప్పే విధంగా కార్యక్రమాలను వివిధ శాఖలు, విద్యాసంస్థలు, యువజన, స్వచ్ఛంద సంఘాల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నారు.
- 75 సంవత్సరాల స్వాతంత్ర్య ముగింపు వేడుకలను పురస్కరించుకుని మేరా మాటి–మేరా దేశ్–ఆజాదీకా అమృత్ మహోత్సవ్ పేరు మీదుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు యువజన సంక్షేమ శాఖ అధికారులు ఈ నెలలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు.
- ఇండియన్ ఆర్మీ/ఎయిర్‌ఫోర్స్ మొదలైన రక్షణ దళాల్లో నిర్వహించే ఉద్యోగాల భర్తీ కార్యక్రమాల గురించి నిరుద్యోగ యువతకు సమాచారం తెలిసే విధంగా వివిధ సామాజిక, ప్రచార మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నారు.
- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ, పోలీస్ శాఖ సహకారంతో వివిధ డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, దుష్పరిణామాలు, ఈవ్ టీజింగ్, సైబర్ క్రైమ్, మహిళల అక్రమ రవాణా అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉచితంగా శిక్షణ



జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 59కి పైగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ఉచితంగా కెరీర్ గైడెన్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, లైఫ్‌స్కిల్స్, ఇంటర్వ్యూ ప్రిపరేషన్,ఎగ్జామ్ ప్రిపరేషన్‌పై ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. ఉన్నత చదువులు,ఉద్యోగ, ఉపాధి అవకాశాలను చూపించే ఎంతో విలువైన బుక్‌లెట్‌ను ఉచితంగా అందజేస్తున్నాము. ఇంకా ఏ ప్రభుత్వ విద్యాసంస్థలోనైనా ఇలాంటి తరగతులు కావాలంటే కల్లూరు ఎస్టేట్‌లోని తమ కార్యాలయంలో సంప్రదించాలి.

–పీవీ రమణ, జిల్లా యువజన సంక్షేమ శాఖ అధికారి, కర్నూలు

యువతకు సరైన దిశా నిర్దేశం వస్తుంది



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా యువజన సంక్షేమ శాఖ నిర్వహిస్తున్న కార్యక్రమాల ద్వారా యువతకు దిశా నిర్దేశం లభిస్తోంది. చాలా మంది ఉన్నత చదువులు చదువుతున్నా ఎక్కడ ఎలాంటి ఉద్యోగాలు లభిస్తాయి, వాటికి ఎలా సిద్ధం కావాలి, అందుకు ఎలాంటి నైపుణ్యాలు ఉండాలనే విషయాలు తెలియదు. ఇవి తెలియకే చాలా మంది చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ జీవితాన్ని సాగదీస్తున్నారు. ఇలాంటి వారికి ప్రభుత్వం అందించే కార్యక్రమం ఎంతో మంచిది.

–ఎస్.రాజశేఖర్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కౌన్సిలర్, కర్నూలు

ప్రజల చెంతకే పాలన



పడిదెంపాడులో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్
- పడిదెంపాడులో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం

కర్నూలు (న్యూటౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజల వద్దకే పాలనను తీసుకొచ్చారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. శుక్రవారం కర్నూలు మండలం పడిదెంపాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు ఈశ్వరయ్య, లలితమ్మ, బజారి, రామాంజనేయులు తదితరులతో కలిసి ఎమ్మెల్యే స్థానిక మారెమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేసి, రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అలాగే స్థానికంగా నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సచివాలయ వ్యవస్థ ద్వారా తీసుకొచ్చామన్నారు. గత నాలుగేళ్లుగా కులం, మతం, వర్గం, పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తున్నామన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల అభ్యున్నతికి సీఎం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. పేద విద్యార్థులు చదువుకు దూరం కాకూడదని జగనన్న అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన తదితర పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్న తమ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ2 నెహెమ్యా, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, మండల మాజీ ఉపాధ్యక్షులు వాసు, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ మహబూబ్‌బాషా, సచివాలయ కన్వీనర్లు వెంకటేశ్వర్లు, దస్తగిరి, శేఖర్, ఎంపీడీఓ అజాంఖాన్, ఏపీఓ మధుబాబు, ఏఓ విశ్వనాథ్, ఎలక్ట్రికల్ ఏఈ ఆంజనేయశాస్త్రీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి కొండాపురంలో

సి.బెళగల్: మండలంలోని కొండాపురం గ్రామ సచివాలయం పరిధిలో శనివారం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈఓఆర్డీ సందీప్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే సుధాకర్ ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకోవటంతో పాటు ప్రభుత్వం నుంచి ఆయా కుటుంబాలకు అందిన సేవలు, సంక్షేమ పథకాలను వివరించనున్నట్లు పేర్కొన్నారు.

- 19వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం
- ప్రజల నుంచి విశేష స్పందన
- ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశాం
- వైఎస్సార్‌సీపీ జిల్లాల అధ్యక్షులు ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య

ఆప్యాయంగా పలకరిస్తూ.. సంక్షేమ పథకాలు వివరిస్తూ



ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బీవై రామయ్య

కల్లూరు: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. శుక్రవారం కల్లూరు అర్బన్ 19వ వార్డు పరిధిలోని చంద్రశేఖర్ నగర్, వెంకటాద్రి నగర్, శ్రీవారి కుటీర్ కాలనీలో ఈకార్యక్రమం నిర్వహించారు. ఆయా కాలనీల్లో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య ఇంటింటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అలాగే ఏవైనా సమస్యలుంటే తెలియజయాలని కోరారు. కొందరు తమ కాలనీలో డ్రైనేజీలు, సీసీ రోడ్లు, కల్వర్టులు నిర్మించాలని కోరగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అక్కడికక్కడే మునిసిపల్ అధికారులను ఆదేశించారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని, మేయర్ బీవై రామయ్య అన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 98శాతం అమలు చేశామన్నారు. మహిళల అభ్యున్నతే ధ్యేయంగా వైఎస్సార్ చేయూత, ఆసరా, సున్నావడ్డీ, అమ్మ ఒడి మొదలగు పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఆయా పథకాలను వినియోగించుకుని జీవనోపాధులను మెరుపర్చుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పథకాలను, ప్రభుత్వ సేవలను చేర్చుతున్నామనానరు. గతంలో ప్రభుత్వ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీ సిఫార్సు చేయాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదని, అర్హతే ప్రామాణికంగా పథకాలను అందజేస్తున్నామన్నారు. వివిధ రూపాల్లో మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో మరోసారి పట్టం కటాలన్నారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు శ్వేతారెడ్డి, నాగలక్ష్మిరెడ్డి, శ్రీనివాసులు, లక్ష్మీకాంతరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నారాయణరెడ్డి, విక్రమసింహారెడ్డి, కో–ఆప్షన్‌మెంబర్ కృష్ణమూర్తి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నేడు నాయకల్లు గ్రామంలో

కల్లూరు: మండల పరిధిలోని నాయకల్లు గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జీవి రమణమూర్తి శుక్రవారం తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరవుతారన్నారు.

మహిళా సంక్షేమానికి జగనన్న పెద్దపీట

- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



స్వయం సహాయక సంఘాల సభ్యులతో కలిసి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే

కోడుమూరు రూరల్: మహిళా సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం మంజూరు చేసిన నాల్గవ విడత వైఎస్సార్ సున్నా వడ్డీ చెక్కును శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో మహిళలకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత గజనన్నకే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలోని 5,067 స్వయం సహాయక సంఘాలకు వరుసగా నాల్గవ ఏడాది వైఎస్సార్ సున్నా వడ్డీ కింద రూ.5,65,21,000 మహిళల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. మహిళా సంక్షేమానికి కృషి చేస్తున్న జగనన్నను మహిళలంతా మరోసారి దీవించి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. అనంతరం స్వయం సహాయక సంఘాల మహిళలతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఎంలు పుష్పావతి, వెంకటస్వామి, సుధాకర్, మల్లికార్జున, పార్టీ నేతలు అద్దుగల రాజశేఖర్‌రెడ్డి, లాయర్ ప్రభాకర్, ప్రతాప్‌రెడ్డి, కొలుట్ల, బలరాం, ఏకాంబరం పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలి

ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటి పెంచాలని ఎమ్మెల్యే సుధాకర్ ప్రజలకు సూచించారు. నాభూమి–నాదేశం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక బాలుర హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిపైన జీవకోటి మనుగడకు చెట్లు ఎంతో ప్రధానమైనవని, చెట్లను విచ్చలవిడిగా నరికేయడం వల్ల పర్యావరణ సమతుల్యం దెబ్బతిని జీవకోటి మనుగడ ప్రమాదంలో పడుతుందన్నారు.

క్రైం కార్నర్

సారా విక్రేతల అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న ఎస్ఐ రాజారెడ్డి

ఓర్వకల్లు: మండల పరిధిలోని మీదివేముల గ్రామ పరిసరాల్లో అక్రమంగా సారా విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఎస్ఐ రాజారెడ్డి తెలిపిన వివరాలు.. మీదివేముల గ్రామంలో తనిఖీలు చేస్తుండగా బోయ చంద్ర, కలుగొట్ల మద్దయ్య సారా విక్రయిస్తూ పట్టుబడ్డారు. వారిని అరెస్ట్ చేసి, 30 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం చెంచుకాలనీలో నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలో తోట వీరయ్య, జయంపు ఈదులు ఉన్నారు. వీరి వద్ద 20లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే 400 లీటర్ల చక్కెర ఊటను ధ్వంసం చేశాశారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పి. అశోక్ చెప్పారు.

నామినేషన్ తిరస్కరణ

గడివేముల: మండల పరిధిలోని దుర్వేశి గ్రామంలో ఖాళీగా ఉన్న 9వ వార్డుకు రెండు నామినేషన్లు వచ్చాయి. ఈ వార్డు బీసీ మహిళకు రిజర్వ్ చేయడం జరిగింది. ఇందులో టీడీపీ మద్దదారు రాలు బాలబోయిని సరోజమ్మ నామినేషన్‌ను తిరస్కరించినట్లు రిటర్నింగ్ అధికారి అబ్దుల్‌ఖాలీక్ శుక్రవారం తెలిపారు. బీసీకి రిజర్వ్ చేసిన వార్డులో ఎస్సీ నామినేషన్ వేయడంతో తిరస్కరించినట్లు ఆర్ఓ చెప్పారు. వైఎస్సార్‌సీపీ మద్దదారురాలు లక్ష్మీదేవి నామినేషన్‌ను ఆమోదించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గూడూరు: గూడూరు, కోడుమూరు, సి.బెళగల్ మండలాల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ జేసస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ల లైన్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి



బ్రాహ్మణదొడ్డి చెరువు నీటిని పొలాలకు విడుదల చేస్తున్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

సి.బెళగల్: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బ్రాహ్మణదొడ్డి గ్రామ చెరువు నీటిని ఆయన పొలాలకు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుకు కావాల్సిన అన్ని సేవలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాల్లోనే లభించేలా చేశారన్నారు. ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే రైతులకు పంట సాగు పెట్టుబడి నిధిగా రైతు భరోసాను అందించిన ఘనత జగనన్నదేనన్నారు. వ్యవసాయానికి పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ తదితర పథకాలతో అన్నదాతను ఆదుకోవడంలో ప్రభుత్వం ముందు వరుసలో నిలిచిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సి.బెళగల్, గూడూరు మండలాల కన్వీనర్లు సోమశేఖర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాయకులు నరసింహుడు, మద్దిలేటి, వెంకటేష్, గోపాల్, హారున్, పులిరాజు, కరునాకర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, అంజి, రుక్మంద, సర్పంచులు పాండురంగన్న, దస్తగిరి ఉన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీపీ శారద, మండల ప్రత్యేక అధికారి రమణ

కల్లూరు: సమాజంలో అందరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కల్లూరు మండల అధ్యక్షురాలు(ఎంపీపీ) బోయ శారద అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా శుక్రవారం నాదేశం– నామట్టి కార్యక్రమం చేపట్టి పాఠశాలలు, సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆస్పత్రుల దగ్గర మొక్కలు నాటారు. సల్కాపురంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ చెట్లను పెంచాలన్నారు. వాటిని నరికితే పర్యావరణం దెబ్బతింటుందని చెప్పారు. మండల ప్రత్యేక అధికారి, సెట్కూరు సీఈఓ రమణ మాట్లాడుతూ మొక్కలు నాటడంతోనే సరిపోదని బాధ్యతాయుతంగా వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ లక్ష్మన్న, సర్పంచ్ మద్దిలేటి, ఏపీఓ మదేశ్వరమ్మ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

- మండల పరిధిలోని పర్లలోని గ్రామీణ ఆరోగ్య, శిక్షణ కేంద్రంలో సర్పంచ్ హనుమక్క, ఏపీడీ లక్ష్మన్న, ఈసీ మధుసుదన్‌రావు, వైద్యాధికారులు, సిబ్బంది, ఉపాధి సిబ్బంది మొక్కలు నాటారు.
- చిన్నటేకూరు సమీపంలోని సీఈఓస్ ఫార్మసీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ బృందం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవిప్రకాష్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వెంకటరామయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

లద్దగిరి పీహెచ్‌సీని సందర్శించిన నేషనల్ క్వాలిటీ టీమ్



వైద్యసేవలపై సిబ్బందిని ఆరా తీస్తున్న నేషనల్ క్వాలిటీ అసెస్‌మెంట్ స్టాండర్డ్ టీమ్ సభ్యులు

కోడుమూరు: మండలంలోని లద్దగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నేషనల్ క్వాలిటీ అసెస్‌మెంట్ స్టాండర్డ్ టీమ్ సభ్యులు డాక్టర్ కమాల్ హుసేన్, రెజీనా రాణి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా టీమ్ సభ్యులు ఆస్పత్రిలో రోగులకందుతున్న సేవలను, డాక్టర్ల పనితీరును పరిశీలించడంతో పాటు, ఓపీ, ఐపీ సర్వీసెస్ లాబ్, లేబర్ రూం, ఫార్మసీ, నేషనల్ ప్రోగ్రామ్స్ అయినటువంటి వ్యాక్సినేషన్, టీబీ, మలేరియా, ఎయిడ్స్, లెప్రసీ, ఫ్యామిలీ ప్లానింగ్ తదితర రికార్డులను పరిశీలించి వైద్య సిబ్బందితో మాట్లాడారు. ఆస్పత్రికొచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించడంతో పాటు, ప్రతి గర్భిణి ఆస్పత్రిలో ప్రసవమయ్యేలా చూడాలన్నారు. హాస్పిటల్ నుంచి వచ్చే వ్యర్థ పదార్థాలను బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ తీసుకెళ్లేలా చూడాలన్నారు. ఆస్పత్రి పనితీరుపై నివేదిక తయారు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని, పీహెచ్‌సీకి వచ్చే ఫండ్స్ ను ఆస్పత్రికొచ్చే ప్రజల కోసం ఖర్చు పెట్టాలని లద్దగిరి పీహెచ్‌సీ వైద్యాధికారులు నస్రీన్, జయంతిలకు సూచించారు. కార్యక్రమంలో ఎన్‌క్యూఏఎస్ జిల్లా కన్సల్‌టెంట్ మూర్తుజావలి, లద్దగిరి పీహెచ్‌సీ సీహెచ్ఓ శాంత, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్‌యాదవ్, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ఉన్నారు.

గ్రామగ్రామానా 'నా భూమి– నా దేశం'



బూడిదపాడులో మొక్క నాటుతున్న డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి, తదితరులు

గూడూరు: మండలంలోని బూడిదపాడు, గుడిపాడు, మునుగాల, మల్లాపురం గ్రామాలలో శుక్రవారం నాడు 'నా భూమి– నా దేశం' కార్యక్రమం ఉపాధి సిబ్బంది నిర్వహించారు. బూడిదపాడులో జరిగిన కార్యక్రమంలో డ్వామా పీడీ అమర్నాథరెడ్డి, జిల్లా స్పెషల్ ఆఫీసర్ రూప్ కుమార్, ఎంపీడీఓ మాధవీలత పాల్గొన్నారు. ముందుగా దేశం కోసం అసువులు బాసిన అమర వీరులకు అధికారులు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. పీడీ మాట్లాడుతూ మన భూమి– మన దేశం అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. విద్యార్థుల చేత దేశ భక్తి గేయాలు ఆలపించారు. అనంతరం అధికారులు మొక్కలు నాటారు. సర్పంచ్ పార్వతమ్మ, ఈజీఎస్ ఏపీడీ అల్లీపీరా, ఏపీఓ రామేశ్వరమ్మ పాల్గొన్నారు.